క్లుప్తంగా

కండలేరులో 6.303 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 6.303 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 5 క్యూసెక్కులు, లోలెవల్ కాలువకు 15 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

21న గురుపూర్ణిమ వేడుకలు

వెంకటగిరి రూరల్: పట్టణంలోని కుమ్మరిగుంటలో వెలసిన శిరిడీ సాయిబాబా ఆశ్రమంలో ఈ నెల 21న గురుపూర్ణిమ సందర్భంగా వేడుకలు నిర్వహించనున్నట్టు శిరిడీ సాయి ఆశ్రమ ఎడ్యుకేషనల్ సర్వీసు సొసైటీ నిర్వాహకులు తెలిపారు. ఆరోజు ఉదయం నుంచి రాత్రి వరకు పలు పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

అధిక జనాభాను నియంత్రించాలి



వేపనాపిలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, వైద్య సిబ్బంది

రాపూరు: అధిక జనాభా వల్ల దేశానికి అనర్థాలు కలుగుతాయని వేపినాపి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు రాజకుమారి తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం ఆమె గురువారం వేపినాపి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. అనంతరం మానవ హారం ఏర్పాటుచేసి అధిక జనాభా వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.

మీజూరులో వైద్య శిబిరం

దొరవారిసత్రం: మండలంలోని మీజూరు గ్రామంలో గురువారం వైద్య, 104 సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించి రోగులకు వైద్య పరీక్షలు చేశారు. మందులు అందజేశారు. అదే విధంగా డీవీ సత్రం, తొగరాముడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అధిక జనాభా వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.

గడ్డి వామి దగ్ధం

చిల్లకూరు: మండలంలోని పొన్నవోలులో బుధవారం రాత్రి గడ్డి వామి దగ్ధమైంది. దీంతో రూ.లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోతున్నాడు. స్థానికుల కథనం మేరకు.. పొన్నవోలు గ్రామానికి చెందిన ఆదిశేషయ్య సుమారు 10 ఎకరాల పొలంలో పండించిన వరి గడ్డిని ఇంటికి సమీపంలో వామిగా వేసుకున్నాడు. ఈ క్రమంలో వామికి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం గడ్డికి మంట పెట్టారు. నిప్పు రవ్వలు గాలికి ఎగిరి వచ్చి వామిపై పడడంతో మంటలు వ్యాపించాయి. స్థానికులు గూడూరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్ష వరకు నష్టం సంభవించినట్టు రైతు వాపోయాడు.

కార్మికుల సంక్షేమం కోసం ఈయూ పోరాటాలు



కేక్ కట్ చేస్తున్న ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

గూడూరు రూరల్: కార్మికుల సంక్షేమం కోసం ఎంప్లాయీస్ యూనియన్ పోరాటాలు చేస్తోందని ఆ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.సుబ్రమణ్యం తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపోలో గురువారం ఎంప్లాయిస్ యూనియన్ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జెండాను ఎగురవేసారు. అనంతరం ఈ నెలలో ఉద్యోగ విరమణ చేసే కార్మికులతో కేక్ కట్ చేయించారు. వారికి శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలి



కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాసప్రసాద్

ఓజిలి: ఉపాధి కూలీల రోజువారీ సంఖ్యను పెంచాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ ఆదేశించారు. ఆయన గురువారం ఓజిలి ఉపాధి హామీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలోనూ ఉపాధా పనులు చేయించాలన్నారు. ప్రతి రోజూ మండలమంతా 3 వేల మంది కూలీలు పని చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో రైతులకు ఉపయోగపడే పనులను ఎంపిక చేయాలని సూచించారు. కూలీలు చేసిన పనులను ఎప్పటికప్పుడు టీఏలు పరిశీలించి కొలతలు నమోదు చేయాలన్నారు. కూలీలకు త్వరతగతిన బిల్లులు మంజూరయ్యేలా చూడాలని పేర్కొన్నారు. పనుల్లో అవకతవకలకు పాల్పడే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఏపీవో ఉషారాణి, టీఏ భార్గవి పాల్గొన్నారు.

తల్లికి వందనం.. అందరికీ కాదు..



- అందరికీ అన్నాడు.. ఇప్పుడు కొందరికేనా!
- ఇదీ చంద్రబాబు ఊసరవెల్లి రాజకీయం
- అధికారం కోసం ఏమైనా చెప్పడం ఆయన నైజం

ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చడంలో సీఎం చంద్రబాబునాయుడు ఊసరవెల్లిలా వ్యవహరిస్తారనేది మరోసారి రుజువైంది. ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పేరుతో ఆరు పథకాలతో మేనిఫెస్టోను విడుదల చేశారు. అందులో తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున ఇస్తామని ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకే కాకుండా ప్రయివేట్ పాఠశాలల్లో చదివే వారికీ వర్తింపజేస్తామన్నారు. ఇప్పుడు విడుదల చేసిన జీవోలో అందరికీ లేదు కొందరికే అన్నట్టుగా వుంది.

– సూళ్లూరుపేట



ముఖ్యమంత్రి పీఠం ఎక్కేందుకు ఆయన ఎన్ని అబద్ధాలైనా చెబుతారని, ఎన్ని హామీలైన ఇస్తారన్న విషయం తల్లికి వందనం పథకానికి ఇచ్చిన జీవోతో తేటతెల్లమవుతోంది. ఎన్నికలకు ముందు జరిగిన ప్రతి సభలో ఆయన మాట్లాడుతూ 'ఇంట్లో ఎంత మంది వుంటే అంతమందికీ తల్లికి వందనంలో రూ.15 వేలు ఇస్తాను. ఏం తమ్ముళ్లూ నేను ఇస్తాననే నమ్మకం వుందా! లేదా!' అని రాగాలు తీసి హామీలిచ్చారు. ఇప్పుడేమో రకరకాలుగా నిబంధనలను ప్రవేశపెట్టి ఇంటికి ఒక్కరికే ఇచ్చే విధంగా ప్లాన్ చేసుకుంటున్నారని తెలుస్తోంది. గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాసంవత్సరం ప్రారంభంలోనే అమ్మ ఒడి పథకంలో బటన్‌నొక్కి నగదు వేశారు. ఆయన రాజకీయాలు, కులమతాలకు అతీతంగా అర్హత వున్న అందరికీ అమ్మ ఒడి పథకాన్ని అందజేశారు. నియోజకవర్గంలోని ఆరు మండల్లాలో సుమారు 39,276 మంది విద్యార్థులకు అమ్మ ఒడి కింద తల్లుల ఖాతాల్లోకి సుమారు రూ.వంద కోట్లు జమచేశారు. విద్యా సంవత్సరం రాగానే అమ్మ ఒడి, పాఠ్యపుస్తకాలు, విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించారు. ఈ విద్యా సంవత్సరంలో సుమారు 45 వేల మంది విద్యార్థులకు తల్లికి వందనం పథకంలో రూ.15 వేల నగదు జమ చేయాల్సి వుండగా ఇప్పుడే మీనమేషాలు లెక్కిస్తున్నారు. చంద్రబాబు మాట ఇస్తే ఎప్పుడూ మాట మీద వుండడనే విషయం దీని బట్టే తెలుస్తోంది.

తల్లికి వందనం నగదు కోసం ఎదురు చూస్తున్నాం



నాకు ఇద్దరు పిల్లలున్నారు. ఒకరు ఇంటర్, మరొకరు బీటెక్ చదువుతున్నారు. నేను టైలరింగ్ చేసుకుంటాను. పిల్లలకు ఫీజులు కట్టాలని కాలేజీ వాళ్లు అడుగుతున్నారు. ఈ ఏడాదికి తల్లికి వందనం కింద నగదు వస్తేనే ఫీజులు కట్టుకోవాలి. లేదంటే వారిని ఇంటికి పంపించేస్తారేమో అని భయంగా వుంది. నగదు కోసం ఎదురు చూస్తూ ఉన్నాను. లేదంటే ఇబ్బంది పడాల్సి వస్తుంది. –నాగజ్యోతి, సూళ్లూరుపేట

తొందరగా వేస్తే పిల్లలకు ఉపయోగంగా వుంటుంది



మాకు ఇద్దరు పిల్లలు. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ అమ్మకు వందనం కింద నగదు ఇస్తానని చంద్రబాబు చెప్పడంతో నాయుడుపేటలోని ప్రయివేట్ పాఠశాలకు పంపిస్తున్నాం. ఇద్దరికీ వేస్తే మంచిదే. నిబంధనలు పెట్టి ఒక్కరికి వేస్తే మరొకరికి ఫీజు కట్టుకోవాల్సి వుంటుంది. ఇచ్చినమాట ప్రకారం అందరికీ నగదు వేయాలి. ఇస్తారో ఇవ్వరో ఆనే అందోళనగా ఉంది. –మన్నేలి రమణమ్మ, ఆక్కరపాళ, దొరవారిసత్రం

ఇద్దరికీ రూ.30 వేలు వస్తాయనుకున్నాం



మాకు ఇద్దరు పిల్లులు. వారికి తల్లికి వందనం పథకం కింద రూ.30 వేలు వస్తాయని ఆశపడ్డాం. అందుకే ఇద్దరినీ గూడూరు రూరల్ మండలంలోని చెన్నూరులో ఉన్న ఒక ప్రైవేట్ స్కూల్లో చేర్పించాం. ఇప్పటికే స్కూల్ యాజమాన్యం ఫీజులు కోసం ఒత్తిడి చేస్తున్నారు. తల్లికి వందనం పథకం నిధులు వస్తే ఇబ్బంది ఉండదు. లేకుంటే అప్పు చేయాలి. ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని ప్రార్థిస్తున్నాం. –నందిమాల అమరావతి, చాగణం

మాట నిలబెట్టుకుంటాడనే నమ్మకం లేదు



తల్లికి వందనం పథకం కింద ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున నగదు అందజేస్తామని హామీ ఇచ్చారు. మా ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపిస్తున్నాం. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటే పిల్లలిద్దరినీ చదివించుకోవచ్చు. తల్లికి వందనం నగదు ఎప్పుడు వేస్తాడో, ఏమో!. అని పడిగాపులు కాస్తున్నాం.

–పి.శైలజ, పెళ్లకూరు మండలం

నిధులు త్వరగా ఇస్తారని ఆశిస్తున్నాం



మాకు ఇద్దరు పిల్లలున్నారు. చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు తల్లికి వందనం కింద ఎంత మంది ఉంటే అందరికీ ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున ఇస్తామనడంతో ఇద్దరినీ గూడూరులోని ఒక ప్రైవేట్ పాఠశాలలో చేర్పించాం. యాజమాన్యం ఫీజులు అడుగుతున్నారు. తల్లికి వందనం పథకం నిధులు వచ్చిన వెంటనే ఇస్తామని చెప్పాం. వెంటనే విడుదల చేస్తారని ఆశిస్తున్నాం.

–ఆవుల రాజమ్మ, సైదాపురం

మాట ప్రకారం అమలు చేయాలి



గత ప్రభుత్వం అమ్మ ఒడి పథకం కింద బడులు తీసే సమయానికి డబ్బులు నా ఖాతాలో పడేవి. వాటిని పిల్లల చదువులకు వాడుకునే వాళ్లం. మేము వస్తే ఇంట్లో ఎంతమంది ఉంటే అందరికీ రూ.15 వేల చొప్పున ఇస్తామని చంద్రబాబు చెప్పారు. ఇంత వరకు ఒక్క పైసా కూడా పడలేదు. నాకు ముగ్గురు పిల్లలు. ముగ్గురికి రూ.45 వేలు వస్తాయని ఎదురు చూస్తున్నాను.

–వంజివాక సుమతి, వాకాడు

ఘనంగా ఈయూ ఆవిర్భావ దినోత్సవం



యూనియన్ జెండాను ఎగుర వేస్తున్న నక్కా వెంకటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న నక్కా వెంకటేశ్వరరావు

వెంకటగిరి రూరల్: పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద గురువారం ఏపీపీటీడీ (ఏపీ ప్రజా రవాణా శాఖ) ఎంప్లాయిస్ యూనియన్ 73వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డిపో గౌరవ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు యూనియన్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ 1951లో ఏర్పడిందని తెలిపారు. నాటి నుంచి అనేక పోరాటాలు చేసి పలు హక్కులు సాధించుకున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి వైవీ ప్రసాద్, అధ్యక్షుడు రాజగోపాల్, జాయింట్ సెక్రటరీ రమేష్, ట్రెజరీ తారకేశ్వర్, మోహన్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట మెకానిక్స్ కార్యవర్గం ఎన్నిక



సమావేశంలో పాల్గొన్న మెకానిక్స్

నాయుడుపేట టౌన్: నాయుడుపేట మెకానిక్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘ నాయకులు తెలిపారు. పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలోని పాత జీఎన్‌టీ రోడ్డు వద్ద ఉన్న మెకానిక్స్ అసోసియేషన్ కార్యాలయం ఆవరణలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా షేక్ రఫీ, అధ్యక్షుడిగా పీ శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా షేక్ అలీ, కే రమేష్, ప్రధాన కార్యదర్శిగా కే రమేష్, సంయుక్త కార్యదర్శిగా షేక్ అమీర్, కోశాధికారిగా షేక్ ప్రేమ నజీర్, 11 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. వారిని స్థానిక నాయకులు ఎస్ రాజేష్, షేక్ రఫీ సత్కరించారు. అనంతరం మెకానిక్‌లతో కలిసి పట్టణంలో మోటార్ బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు.

ఆటో నగర్ ఏర్పాటుకు కృషి

నాయుడుపేటలో ఆటో నగర్ ఏర్పాటుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. మెకానిక్‌ల సారథ్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పట్టణంలో జాతీయ రహదారి సమీపంలో ఉన్న అన్నా చెరువులో ఆటో నగర్ ఏర్పాటుకు అనువైన స్థలంగా గుర్తించినట్టు తెలిపారు. మెకానిక్కుల సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో న్యాయం జరిగేలా చూస్తామన్నారు. అనంతరం యూనియన్ నాయకులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం, నాయకులు ఎస్.రాజేష్, షేక్ రఫి, శిరసనంబేటి విజయభాస్కర్ రెడ్డి, మెకానిక్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పంట సాగుదారుల హక్కు పత్రంపై అవగాహన



కౌలు రైతు కార్డులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కలువాయి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం పంట సాగుదారుల హక్కు పత్రం (సీసీఆర్‌సీ కార్డు)పై ఏవో వి.ప్రతాప్ అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కౌలుదారుగా నమోదు చేసుకునేందుకు అర్హతలు, దరఖాస్తు చేసుకునేందుకు కావాల్సిన ధ్రువీకరణ పత్రాల గురించి వివరించారు. భూ యజమాని, కౌలుదారుల అంగీకార పత్రం, యజమాని పొలం పాస్‌బుక్, నూతన 1 బీ, ఆధార్ కార్డు, యజమాని, కౌలుదారుల పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకుని వీఆర్వో లేదా వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు లీలా సంజీవకుమారి, చల్లా శ్రీనివాసులు రెడ్డి, చల్లా రఘురామిరెడ్డి రైతులు పాల్గొన్నారు.

భారమవుతున్న ఇసుక రవాణా చార్జీలు



మావిళ్లపాడు ఇసుక స్టాక్ పాయింట్‌లో ఇసుక లోడ్ చేస్తున్న దృశ్యం

దొరవారిసత్రం: ఎన్నికల ముందు ఇసుకను ఉచితంగా ఇస్తామని చెప్పిన చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చాక మాట మార్చడంతో ఇసుక తరలింపు భారంగా మారిందని వినియోగదారులు వాపోతున్నారు. దొరవారిసత్రం మండలం మావిళ్లపాడు సమీపంలోని ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటుచేశారు. అక్కడ టన్ను ఇసుకకు రూ.465 చెల్లించాలి. ఇక్కడి నుంచి ఓజిలి, తడ, పెళ్లకూరు మండలాల్లోని వివిధ గ్రామాలకు ఇసుక తరలించాల్సి ఉంటుంది. స్టాక్ పాయింట్‌లో ట్రాక్టర్ ఇసుక (ఐదు టన్నులు) రూ.2,325లకు కొనుగోలు చేయాల్సి ఉంది. ఇక్కడ నుంచి ఓజిలి, తడ, పెళ్లకూరు మండలాల్లోని వివిధ ప్రాంతాలకు వెళ్లాలంటే ట్రాక్టర్ బాడుగ రూ.3500 నుంచి రూ.4000 వరకు వెచ్చించాల్సి వస్తోందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే గత ప్రభుత్వంలో పలుచోట్ల రీచ్‌లు ఏర్పాటు చేయడంతోపాటు స్టాక్ పాయింట్లు ఉండడంతో అందరికీ ఇసుక అందుబాటు ధరలో సులువుగా లభించిందని పలువురు తెలిపారు.

ట్రిపుల్ ఐటీకి ముగ్గురు విద్యార్థుల ఎంపిక





షేక్ తాసిఫా, హర్షిణి, వెంగమ్మ

కలువాయి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు హర్షిణి(570), వెంగమ్మ(570), చీపినాపి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన షేక్ తాసిఫా(572) ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఈవో తెలిపారు. వారిని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు అబ్బాస్, ఎస్.జనార్దన రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

శేషురెడ్డికి నాయకుల పరామర్శ

చిట్టమూరు(చిల్లకూరు): చిట్టమూరు మండలం మల్లాం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు దువ్వూరు శేషురెడ్డిని గురువారం పలువురు నాయకులు పరామర్శించారు. ఆయన తల్లి ఈశ్వరమ్మ అనారోగ్యంతో బాధపడుతూ గత నెల 26వ తేదీన మృతి చెందారు. గురువారం ఉత్తర క్రియలు నిర్వహించారు. ఈ క్రమంలో నాయకులు గ్రామానికి చేరుకుని దువ్వూరు శేషురెడ్డిని పరామర్శించారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఇన్‌కం ట్యాక్స్ జడ్జి దువ్వూరు రామలింగా రెడ్డి, గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీఎం కిసాన్‌కు 50 వినతులు



రైతుల వినతులను పరిష్కరిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

దొరవారిసత్రం: మండల వ్యవసాయ కార్యాలయంలో గురువారం పీఎం కిసాన్ పథకంపై నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి 50 మంది రైతుల నుంచి వివిధ రకాల సమస్యలపై వినతులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి పరిష్కారమయ్యేలా చర్యలు చేపడతామని వెల్లడించారు. కార్యక్రమంలో ఏఈఏ అనిత, ఏవో జ్యోతిర్మయి, ఎంపీఈవోలు, వీపీఏలు పాల్గొన్నారు.

నేటి నుంచి మౌలాలి పంజా ఉత్సవాలు



పీర్ల పండుగకు సిద్ధం చేస్తున్న గరిడీలోని మౌలాలి తాలీమ్‌ఖానా

నాయుడుపేట టౌన్: మొహరం పండుగ సందర్భంగా పీర్ల పండుగలో భాగంగా పట్టణంలోని గరిడీ వద్ద శుక్రవారం నుంచి రెండు రోజులు మౌలాలీ పంజా ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్టు మౌలాలీ తాలీమ్ ఖానా యువత తెలిపారు. శుక్రవారం సాయంత్రం గరిడీలో పీర్లను ప్రతిష్టించి ప్రత్యేక పూజలు చేస్తామన్నారు. రాత్రి మౌలాలి పంజాను గుర్రంపై ప్రతిష్టించి పట్టణంలో ఊరేగిస్తామని పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం అన్నదానం చేస్తామని హజరత్ మౌలాలీ తాలీమ్ ఖానా యువజన కమిటీ సభ్యులు తెలిపారు.

సిలికా తవ్వకాలను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

చిల్లకూరు: తీర ప్రాంతంలోని వరగలి సమీపంలో సాగరమాల రోడ్డు పనులకు సంబంధించి సబ్ కాంట్రాక్టు పనులను చేపడుతున్న టీడీపీ నాయకులు ప్రభుత్వ భూముల నుంచి సిలికాను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయంపై యథేచ్ఛగా సిలికా అక్రమ తవ్వకాలు అన్న శీర్షికన సాక్షి దిన పత్రికలో గురువారం కథనం వెలువడింది. దీనిపై స్పందించిన వరగలి వీఆర్వో మునిబాబు తవ్వకాలు చేస్తున్న ప్రాంతాలకు వెళ్లి యంత్రాలను అడ్డుకున్నారు. అక్కడ తవ్వకాలు చేపట్టవద్దని హెచ్చరించారు. అనంతరం ప్రభుత్వ భూమిలో చేపట్టిన సిలికా తవ్వకాలపై తహసీల్దార్ శ్రీనివాసులుకు నివేదిక అందించినట్లు తెలిపారు. ఈ విషయమై తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమిలో తవ్విన సిలికాను గునుల శాఖ ద్వారా లెక్కించి సంబంధిత వ్యక్తులపై చర్యలు చేపడతామన్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



ఏకొల్లులో చెత్త తొలిగిస్తున్న పంచాయతీ సిబ్బంది

దొరవారిసత్రం: మండలంలోని పలు గ్రామ సచివాలయాల పరిధిలోని గురువారం వివిధ గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. «గ్రామాల్లో ప్రబలుతున్న అంటురోగాలు» అన్న శీర్షికన గురువారం సాక్షి దిన పత్రకలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన పంచాయతీ కార్యదర్శులు కొత్తపల్లి, తనియాలి, ఏకొల్లు, వెదురుపట్టు తదితర పంచాయతీల్లోని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేయించారు. చెత్తాచెదారం తొలిగించారు.

గంబూసియా చేప పిల్లల విడుదల



మద్దెలమడుగు వద్ద ఉన్న నీటి గుంతలో చేప పిల్లలను విడుదల చేస్తున్న వైద్యసిబ్బంది

రాపూరు: మలేరియా వ్యాధి నిర్మూలనలో భాగంగా దోమల లార్వా నిర్మూలన చర్యల్లో భాగంగా నీటి గుంటల్లో గంబూసియా చేప పిల్లలను విడుదల చేసినట్లు వైద్యులు సూర్యధర్మేంద్ర తెలిపారు. రాపూరు మండలం వేపినాపి పీహెచ్‌సీ పరిధిలో గురువారం మండలంలోని పలు నీటి గుంటల్లో గంబూసియా చేప పిల్లలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ నిల్వ ఉన్న నీటిలో దోమలు లార్వాను పెడతాయని తెలిపారు. వాటిని నిర్మూలించేందుకు నీటి గుంటల్లో చేప పిల్లను వదిలినట్టు వివరించారు. తద్వారా దోమలను నిర్మూలించి మలేరియా రాకుండా అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లింగమూర్తి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతు బజారులో కంది పప్పు విక్రయాలు



కందిపప్పు విక్రయాలను ప్రారంభిస్తున్న రెవెన్యూ అదికారులు

గూడూరు రూరల్: గూడూరు పట్టణంలోని రైతు బజారులో రాయితీపై స్టీమ్ బియ్యం, కంది పప్పు విక్రయిస్తున్నట్టు తహసీల్దార్ కరుణకుమార్ తెలిపారు. ఆయన గురువారం కందిపప్పు, స్టీమ్ బియ్యం విక్రయాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం రైతు బజారుల ద్వారా రాయితీపై విక్రయాలు చేపట్టినట్టు తెలిపారు. రాయితీతో కందిపప్పు రూ.160లు, స్టీమ్ బియ్యం ఒక రకం కిలో రూ.49, మరో రకం రూ.48 చొప్పున విక్రయిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అజ్మతుల్లాఖాన్, నాయకులు పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, వాటంబేటి శివకుమార్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



ఉప్పు నీటి సమస్యపై డీఎల్‌పీవోకు నివేదిక అందజేస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

చిట్టమూరు(చిల్లకూరు): మల్లాం దళితవాడలో నెల కొన్న తాగునీటి సమస్యను సత్వరం పరిష్కరించాలని డివిజనల్ పంచాయతీ అధికారి వెంకటరమణ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. గ్రామానికి చెందిన శంకరయ్య, సుబ్రమణ్యం జిల్లా కలెక్టర్‌ను కలిసి గ్రామంలో తాగునీరు ఉప్పుగా వస్తోందని ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎల్‌పీవో గురువారం గ్రామంలో విచారణ చేపట్టి సమస్యను తెలుసుకున్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో మంచి నీటికి బదులు ఉప్పు నీరు వస్తోందని తెలిపారు. దీంతో ఇబ్బంది పడుతున్నామని పేర్కొన్నారు. మంచి నీరు అందించాలని కోరారు. డీఎల్‌పీవో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి నీటి నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించాలని, మంచి నీరు దొరికే చోట బోర్లు వేసి తాగనీటి అందించేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి అరవింద్, ఈవోపీఆర్‌డీ మనోహరగౌడ్ పాల్గొన్నారు.

డీవీ సత్రంలో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు



డీవీ సత్రంలో సభ్యత్వ నమోదు చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

దొరవారిసత్రం: యూటీఎఫ్ నాయకులు గురువారం దొరవారిసత్రం మండలంలోని పలు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు రాజశేఖర్, దిలీప్‌కుమార్, హుస్సేన్‌బాబు, రాధాకృష్ణయ్య, శ్రీనివాసులు, రమేష్‌బాబు, సురేంద్రబాబు పాల్గొన్నారు.